## కాంగ్రెస్‌లో కలకలం.. షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీసులు

**హైదరాబాద్,జూన్, 13:**కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హైకమాండ్ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా, అలాగే పార్టీ నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు రావడంతో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.


# ప్రజాదర్బార్

తెలుగు దినపత్రిక

## జిల్లా అనుబంధం

ఆదివారం,జూన్, 14,2026

పేజీలు : 8


# 11 ఏళ్ల బాలికపై 50 ఏళ్ల కామాంధుడు అత్యాచారం! దేహశుద్ధి చేసిన గ్రామస్తులు!

అశ్వారావుపేట, ప్రజా దర్బార్ జూన్ 13 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని నందిపాడు గ్రామంలో 11 సంవత్సరాల బాలికపై అత్యాచారం జరిగిన ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న సుమారు 50 ఏళ్ల వ్యక్తి ఈ దారుణానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఘటన అనంతరం నిందితుడు పరారై స్థానిక పోలీస్ స్టేషన్లో లొంగిపోయినట్లు సమాచారం.బాధిత బాలిక కుకునూరు ప్రాంతానికి చెందినదిగా, వేసవి సెలవుల సందర్భంగా నందిపాడులోని బంధువుల ఇంటికి వచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆమె ఐదవ తరగతి చదువుతోంది. శనివారం కూల్‌డ్రింక్ కొనుగోలు చేసేందుకు గ్రామంలోని కిరాణా దుకాణానికి వెళ్లిన సమయంలో నిందితుడు ఆమెను మోసపూరితంగా లోపలికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో సంఘటన చూసిన గ్రామస్తులు అక్కడికక్కడే ఆ కామాంధుడును దేహశుద్ధి చేసినట్లు సమాచారం.బాలికను ఆరా తీయగా జరిగిన విషయం తెలియజేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికను వైద్య పరీక్షల కోసం తరలించినట్లు తెలుస్తోంది. ఘటన వెలుగులోకి రావడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని, నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్ష విధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

### చిన్నారిపై దారుణం.. ఆందోళనలో గ్రామస్తులు

వేసవి సెలవులను ఆనందంగా గడపడానికి బంధువుల ఇంటికి వచ్చిన ఐదవ తరగతి విద్యార్థిని ఇలాంటి దారుణానికి గురికావడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితుడిని త్వరగా అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు.




## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..

**హైదరాబాద్,జూన్, 13:**తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈరోజు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన వాంగ్మూలాన్ని అధికారికంగా నమోదు చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్ విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపడుతోంది. ప్రాథమిక విచారణలో అప్పట్లో ఖమ్మం రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన తుమ్మల నాగేశ్వరరావు కూడా ట్యాపింగ్‌కు గురైన వారిలో ఒకరని గుర్తించినట్లు సమాచారం. కొందరు ఇంటెలిజెన్స్ అధికారులు ఆయన ఫోన్‌ను అక్రమంగా ట్యాప్ చేయడంతో పాటు, ఆయన కదలికలను ట్రాక్ చేసి వ్యక్తిగత సంభాషణలను పర్యవేక్షించినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి నివాసంలో జరిగిన విచారణ సందర్భంగా ఆయన ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా, వ్యక్తిగత కమ్యూనికేషన్లపై జరిగిన నిఘాకు సంబంధించి సిట్ అధికారులు పలు వివరాలు సేకరించారు. బాధితుడిగా తుమ్మల ఇచ్చిన వాంగ్మూలం కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

# అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు

### -రచ్చపల్లి మాజీ సర్పంచ్ జనగామ నర్సింగరావును హెచ్చరించిన కనవేన శ్రీనివాస్ యాదవ్

మంథని, జూన్ 13,(ప్రజాదర్బార్ )తనపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని రచ్చపల్లి మాజీ సర్పంచ్ జనగామ నర్సింగరావును మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కనవేన శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. శనివారం మంథని ప్రెస్ క్లబ్ లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కనవేన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ మాజీ సర్పంచ్ జనగామ నర్సింగరావు తనపై తప్పుడు ఆరోపణలు చేశాడని విమర్శించారు. తాను గతంలో పాలు అమ్మిన మాట నిజమేనని ఆ తర్వాత ఎల్ఐసి ఏజెంట్ గా మారి ఎక్కువ పాలసీలు చేసి ఇప్పుడు సంవత్సరానికి దాదాపు 12 లక్షలకు పైగా కమిషన్ రూపంలో తీసుకుంటున్నానని, తర్వాత వ్యాపారాలు నిర్వహిస్తూ ఎక్కువ మొత్తంలో సంపాదిస్తున్నానని అంతేకానీ పైరవిలు చేసి కమిషన్లతో కక్కుర్తి పడటం లేదన్నారు. తాను సంపాదించిన మొత్తం నుండే భూములు పొలాలు కొనడం జరుగుతుందన్నారు. మరి నీవు ఎలాంటి వ్యవసాయాలు, వ్యాపారాలు చేయడం లేదు కద మరి నువ్వు మంథనిలో కరీంనగర్ లో హైదరాబాదులో భూములు కొని ఇండ్లు ఎలా కడుతున్నావు..ఏ బ్రోకరిజం చేస్తున్నావో సమాధానం చెప్పాలన్నారు. నేను సంపాదించిన ప్రతి దానికి ఆధారాలు ఉన్నాయని కావాలంటే నా అకౌంట్ నెంబర్లను సైతం అందజేస్తానన్నారు. మా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కరెంటు వాడుకోవడం లేదా అని ప్రశ్నించావని నేను ఇప్పటివరకు ఉచిత కరెంటు వాడుకోవడం లేదని దానికి సంబంధించిన రుజువులను చూపిస్తున్నానన్నారు. ఇన్ని రోజులు నీకు కండ్లు కనబడవు అనే విషయం అందరికీ తెలుసునని ఇప్పుడు చెవులు కూడా వినబడడం లేదనే విషయం మాకు అర్థమయిందన్నారు. ఎందుకంటే అప్పటి ముత్తారం టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఇంట్లో మీ నాయకుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గంజాయి ప్యాకెట్లు పెట్టమని చెప్పడం నిజం కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు కాదు ఎప్పటికీ నేను మీ నాయకుని గంజాయి బాబు అనే పిలుస్తానని పేర్కొన్నారు. నీవు కాంగ్రెస్ పార్టీలో ఉండి మీ సారు అప్పుడు ఎమ్మెల్యేగా ఉండి కూడా నీవు మా నాయకుడు పుట్ట మధు దగ్గరికి వచ్చి పనులు చేయించుకుంది నిజం కాదా అని ప్రశ్నించి రుజువులు చూపించారు. నీవు మంత్రి శ్రీధర్ బాబు, శ్రీను బాబుల మెప్పుకోసం నన్ను విమర్శించడం మానుకోవాలని హెచ్చరించాడు. జనగామ నర్సింగరావు ఊరికి మంచి చేసే నాయకుడు అయితే ప్రజలు ఆదరించే వారని కానీ మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో నీవు ఎంత ఖర్చు పెట్టినా మీ నాయకుడు ఎంత పంపిన నిన్ను ప్రజలు తిరస్కరించడం నిజం కాదా అన్నారు. ఇకనైనా నోరు అదుపులో పెట్టుకుని బాధ్యతగా వ్యవహరించమని సూచించారు.



# గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కష్టపడి చదవాలి

## పదవ తరగతి టాపర్ విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే

నిజాంసాగర్ (జుక్కల్) జూన్13, ప్రజాదర్బార్: గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కష్టపడి చదవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ అన్నారు. శనివారం పెద్ద కొడప్ గల్ మండలం వడ్లం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,నూతనంగా ఎన్నికైన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాధప్పవర్ శామప్ప ను జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాధప్పవర్ శామప్ప ను ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఫలితాలు సాధించడం అభినందనీ యమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు ఉచితంగా దుస్తులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యకర్తలు,నాయకులను కలుపుకొని పనిచేయాలన్నారు. తర్వాత గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని ఎమ్మెల్యే,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అభినందించి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, ఎన్ఆర్ఐ భుజంగారి భాస్కర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ భూలక్ష్మి దేవి బోనాల పండుగ కళ్యాణం



బీబీపేట జూన్13( ప్రజా దర్బార్ ) బీబీ పేట మండల కేంద్రంలో బస్టాండ్ ఏరియా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఈ పండగను సంఘం ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా జరిపిస్తారు అదే మాదిరి ఈ సంవత్సరం శ్రీ భూలక్ష్మి దేవి అమ్మవారి ఆలయంలో గణపతి పూజ పుణ్యా వచనము గణపతి హోమము శ్రీ సూక్త హోమము జరిపించి అమ్మవారికి డీజే డప్పు చప్పులతో బోనాలు అమ్మవారి అభిషేకం కళ్యాణం వంటి కార్యక్రమాలను అంగరంగ వైభవంగా జరిపించి సంఘ సభ్యులు అందరూ కలిసి భక్తులందరికీ అన్నదాన ప్రసాదాన్ని అందజేయడం జరిగింది ఇదే కాకుండా ఐలయ్య పెద్దపల్లి కళాబృందం వారిచే ఒగ్గు కథను రెండు రోజులు జరిపించడం జరిగింది ఇట్టి పండగకు దూర దూర ప్రాంతాల నుండి వారి వారి బంధుమిత్రులను పిలుచుకొని ఊరు ఊరంతా పండగ వాతావరణాన్ని నెలకొల్పి ఊరందరికీ అన్నదాన ప్రసాదాన్ని అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో శ్రీ భూలక్ష్మి దేవి ఆలయ కమిటీ బస్టాండ్ ఏరియా మున్నూరు కాపు సంఘ సభ్యులందరూ పాల్గొన్నారు

# చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ

## అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని మనవి

రంగారెడ్డి జిల్లా బ్యూరో 13 జూన్ (ప్రజాదర్బార్):- షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ, జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రాచార్య, అర్చకులు, ప్రమోద్, సునీల్ పంతులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పులిమామిడి శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ప్రతి



శనివారం దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, జి.వసంతరావు, అన్నారం రఘు గౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, శంకర్ గౌడ్, లక్ష్మారెడ్డి, యాదగిరి, తులసి రామ్, రఘునందన్ రెడ్డి, సుప్ప నర్సింలు, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, శంకరయ్య, వీఆర్వో బచ్చన్న, సుప్ప కృష్ణయ్య, పి.ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, జగన్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, రవి, హనుమంత్ రెడ్డి, రవీందర్, నరసింహులు, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ డివిజన్ గా తీర్చి దిద్దడమే లక్ష్యం

అల్వాల్, జూన్ 13 (ప్రజాదర్బార్): అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం హనుమాన్ టేకిడిలో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్ శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులతో కలిసి పనులను ప్రారంభించిన ఆయన, మచ్చ బొల్లారం డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు భాగ్యలక్ష్మి, నిరూప, విజయ, అరుణ, నీలవేణి, రవి, మహేష్, ఈశ్వర్, రమేష్, మైకల్‌తో పాటు నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ గౌడ్, దిడ్ల స్వామి, సర్వేష్ యాదవ్, సంపత్ యాదవ్, వెంకటేష్ గౌడ్, సందీప్, విష్ణు, కేసీఆర్, శకుంతల నాయుడు, విజయలక్ష్మి, అరుణ, భాగ్యమ్మ పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీకి కంకణ బద్ధులమై పనిచేస్తాం

చౌటుప్పల్ జూన్ 13 (ప్రజా దర్బార్ )మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్యతో కలిసి చౌటుప్పల్ మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన బోయ దేవేందర్, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన కాసర్ల శ్రీనివాస్ రెడ్డిలు హైదరాబాదులోని నివాసంలో శనివారం కలిశారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా బోయ దేవేందర్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ తమకు అవకాశం కల్పించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి కంకణ బద్ధులమై పనిచేస్తామన్నారు.



# బంగారం మెరిపిస్తామని మోసం చేసిన కేటుగాళ్లు

## -- గుర్తుతెలియని వ్యక్తుల మాయ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దు

రాయపోల్ జూన్ 13 (ప్రజా దర్బార్): బంగారు ఆభరణాలను కొత్తవాటిలా మెరిపిస్తామని నమ్మబలికి మహిళలను మోసం చేస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో శనివారం ఇద్దరు యువకులు ఈ తరహా మోసానికి పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని పలువురు ఇళ్లకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు తమ వద్ద ఉన్న ప్రత్యేక పౌడర్, లిక్విడ్‌తో బంగారం, వెండి ఆభరణాలను తెల్లగా చేసి మెరిపిస్తామని చెప్పారు.చాలా మంది వారి మాటలను నమ్మలేదు. చివరకు గ్రామానికి చెందిన కళ్లెపు అనూష ఇంటికి వెళ్లిన వారు ముందుగా ఆమె చేతులపై పౌడర్ వేసి నమ్మకం కల్పించారు.ఆ తర్వాత అనూష మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు, ఆమెతో పాటు ఆమె చెల్లి కాళ్లలో ఉన్న వెండి పట్ట గొలుసులను తీసుకుని శుభ్రం చేస్తామని చెప్పారు. ఏదో రసాయన ద్రావణంలో వాటిని ముంచి కొంతసేపటి తర్వాత తిరిగి ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు.ఆభరణాల బరువు తక్కువగా ఉన్నట్లు గమనించిన బాధితులు



స్థానిక బంగారు దుకాణంలో తూకం వేయించగా సుమారు 8 గ్రాముల బంగారం కరిగించి కాజేసినట్లు గుర్తించారు. దీంతో మోసపోయామని తెలుసుకున్న వారు కన్నీరుమున్నీరయ్యారు.బంగారం ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఇలాంటి మోసాలు, దొంగతనాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అపరిచితులు ఇంటికి వచ్చి ఆభరణాలు మెరిపిస్తామని, శుభ్రం చేస్తామని చెప్పినా ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని పోలీసులు సూచిస్తున్నారు.ఘటనపై సమాచారం అందుకున్న తొగుట పోలీసులు విచారణ చేపట్టి నిందితుల కోసం గాలిస్తున్నారు. మహిళలు అప్రమత్తంగా ఉండి విలువైన ఆభరణాలను అపరిచితుల చేతికి ఇవ్వవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# 5న అర్వపల్లిలో జరిగే బిఎల్ఏ ల సమావేశంను జయప్రదం చేయండి

## -బూత్ లెవెల్ ఏజెంట్లు,బిఆర్ఎస్ సభ్యత్వ ఇంచార్జీ లు హాజరు కావాలి -బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య

తుంగతుర్తి (ప్రజాదర్బార్) ఈ నెల 15 సోమవారం రోజున అర్వపల్లి మండలకేంద్రం లో లక్ష్మీ ఫంక్షన్ హాల్లో మాజీశాసనసభ్యులు కిషోర్ అన్న అధ్యక్షతననియోజకవర్గ బూత్ లెవెల్ ఏజెంట్లు. బిఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ ఇంచార్జీ ల సమావేశం నిర్వహించబడును. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి వర్యులు సూర్యాపేట ఎమ్మెల్యే గౌ గుంతకండ్ల జగదీష్ రెడ్డి. ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జీ రాష్ట్ర బిఆర్ఎస్ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, జిల్లా పార్టీ అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, నియోజక వర్గం సభ్యత్వ ఇంచార్జి యలగందుల వెంకటేశ్వర్లు హాజరు అగుదురు కావున ప్రతి గ్రామం నుంచి పేర్లు పంపిన బూత్ ఏజెంట్ మరియు సభ్యత్వ ఇంచార్జీలు. సర్పంచ్ లు. మాజీ ప్రజాప్రతినిధులు మండల. గ్రామ పార్టీ ముఖ్య నాయకులు తప్పనిసరిగా హాజరు కాగలరు. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు లో పూర్తిగా విఫలమైంది. వర్షాకాలం ప్రారంభం అయి 20రోజులు అవుతున్న



వ్యవసాయ శాఖ ప్రణాళిక మీద స్థానిక ఎమ్మెల్యే కానీ. జిల్లామంత్రి కానీ ఇంతవరకు రివ్యూ జరిపిన పాపాన పోలేదు. గత రెండున్నర ఏండ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేఖ.. ప్రజా వ్యతిరేఖ విధానాలు అవలంవిస్తుంది కావున కాంగ్రెస్ ప్రభుత్వానికి. కాంగ్రెస్ పార్టీకి తగిన గుణ పాఠం చెప్పేందుకు జరుగుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరు భాద్యతగా సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్ మండల నాయకులు గోపగాని రమేష్ సర్పంచ్ ఎల్లయ్య, నాగమల్లు,వెంకటేష్, టౌన్ ప్రెసిడెంట్ గోపగాని శ్రీనివాస్, గోపగాని వెంకన్న.. తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రంలో జర్నలిస్టులకు సంస్కరణ తీసుకురావాలి!!

## -సీనియర్ జర్నలిస్టు బాబా.

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి జూన్ 13( ప్రజా దర్బార్ ): జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గ రాజోలి మండల కేంద్రానికి చెందిన సీని యర్ జర్నలిస్టు బాబా మాట్లాడు తూ... రాష్ట్రంలో జర్నలి స్టులకు ప్రభుత్వపరమైన సౌకర్యాలు ఏం లేవని అన్నారు.ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా రాష్ట్రంలో అయినా దేశంలో అయినా నాలుగో స్తంభంగా... ఉన్న జర్నలిజానికి మరియు జర్నలిస్టులకు సమా జానికి మరియు ప్రజలకు ప్రభు త్వానికి మధ్య వారధిగా కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ. ఈ జర్న లిజానికి జర్నలిస్టులకు ప్రధాన్యత లేదని అన్నారు. జర్నలిస్టులస మాజానికి మరిన్ని సంస్కరణలు తీసుకు వచ్చినప్పుడే ప్రజలకు మరియు సమాజానికి ప్రభుత్వా నికి మధ్య లక్ష్యం అనేది నెరవే రుతుందని ఆయన తెలుపుతూ ప్రభుత్వపరమైన జర్నలిస్టులకు ప్రతి నెల గౌరవేతనం మరియు విద్యా,వైద్యము,పథకాలలో,మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి అన్నారు. అలాగే పొరుగు రాష్ట్రం అయినా కేరళ ఇతర రాష్ట్రాలలో జర్నలి స్టుల సమాజానికి గౌరవేతనం ఏ విధంగా అమలు చేశారో.. అదేవి ధంగా మన తెలంగాణ రాష్ట్రానికి కూడా గౌరవేతనం అమలు చేసి..ప్రభుత్వ పరమైన బెనిఫిట్స్ ఇవ్వాలని రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై చొరవ



తీసుకో వాలని రాష్ట్ర జర్నలిస్టుల తరపున ఆయన ఒక ప్రకటనలో కోరా రు.

# ప్రభుత్వ పాఠశాలల్లో 20 శాతం అదనపు నమోదు లక్ష్యం

అల్వాల్, జూన్ 13 (ప్రజాదర్బార్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడమే లక్ష్యంగా అల్వాల్ మండల విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు మండల విద్యాధికారి మురళీకృష్ణ శనివారం విలేఖరులకు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. గత విద్యా సంవత్సరంలో 4001 మంది విద్యార్థులు నమోదు కాగా, ఈ ఏడాది 20 శాతం అదనంగా మొత్తం 4801 మంది విద్యార్థుల నమోదును లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. జూన్ 3 నుంచి 12 వరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'బడిబాట' ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించి ప్రచారం చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, ల్యాబ్‌లు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజన సదుపాయం వంటి కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించామని తెలిపారు. అలాగే శిక్షణ పొందిన నిపుణులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది అల్వాల్ మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ–ప్రైమరీ (నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ) సెక్షన్లు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే సీఎం బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌ను జెడ్పీహెచ్ఎస్ దొడ్డి అల్వాల్, జెడ్పీహెచ్ఎస్ అల్వాల్ బాలుర, బాలికల పాఠశాలలు, జెడ్పీహెచ్ఎస్ కౌకూర్‌లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల వసతులను సద్వినియోగం చేసుకుని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ విజ్ఞప్తి చేశారు.

# ఉప్పల్ నియోజకవర్గం బి ఎస్ పి ఉపాధ్యక్షులు గా వంపు వెంకటేష్

– నాచారం, 13 జూన్ ( ప్రజాదర్బార్ ) బహుజన్ సమాజ్ పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా టీం ఆధ్వర్యంలో ఉప్పల్ అసెంబ్లీ నూతన ఉపాధ్యక్షులుగా రామంతపురం రాజేంద్రనగర్ కాలనీకి చెందినటువంటి వంపు వెంకటేష్ ను జిల్లా అధ్యక్షులు మల్లె పోగు విజయ రాజు నియమించి నియామక పత్రము అందజేసి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో సీనియర్ నాయకులు విజయ్ అన్న గారు అలాగే ఉపాధ్యక్షులు కొండ అప్పారావు గారు, సెక్రెటరీ గ్యార గోవర్ధన్, ఈసీ మెంబర్ సుక్క దయానంద్ బొడ్డుపల ఇన్చార్జి బొట్ల విజయ్ గారు, అసెంబ్లీ అధ్యక్షులు మీంద్రాల నర్సింగ్ రావు, గారు నూతన బీఎస్పీ నాయకులు ఎండి జాఫర్ గారు మరియు బాంబ్సెఫ్ నాయకులు పాల్గొనడం జరిగింది.



# శ్రీ సాయినాథ్ యూత్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు మహానంది పురస్కారాలు

జమ్మికుంట ప్రతినిధి, జూన్ 13 (ప్రజాదర్బార్): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు సాహితి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జమ్మికుంట మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీ సాయినాథ్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బలబత్తుల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి బోరాల గోపిలకు ప్రతిష్ఠాత్మక మహానంది పురస్కార్ అవార్డులు ప్రదానం చేశారు. గత 25 సంవత్సరాలుగా సమాజ సేవలో భాగంగా పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు విశేష సేవలందిస్తున్నందుకు వీరిని ఈ అవార్డులకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహిస్తూ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగుతున్న వీరి సేవలను సభలో పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ, తమ సేవలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.



భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజాభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ పురస్కారం తమపై మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయినాథ్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కందారపు రాజేష్, సభ్యులు తుమ్మ రాజేష్, ఆకుల సురేష్, గుత్తికొండ శ్రీధర్, లడే శ్రీకాంత్, అనిల్, రాజు తదితరులు పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు.

# దొమ్మాట క్లస్టర్ ఏఈఓ సంతోష్ కుమార్‌కు ఘన వీడ్కోలు సన్మానం

దౌల్తాబాద్, జూన్ 13 (ప్రజా దర్బార్ ) దౌల్తాబాద్ మండలంలోని దొమ్మాట క్లస్టర్ గ్రామాలైన దొమ్మాట, సూరంపల్లి, గాజులపల్లి, ముత్యంపేట, లింగరాజుపల్లి గ్రామాలకు గత ఎనిమిది సంవత్సరాలుగా వ్యవసాయ శాఖలో ఏఈఓగా సేవలందించిన సంతోష్ కుమార్ బదిలీపై పాపన్నపేట మండలానికి వెళ్తున్న సందర్భంగా శనివారం ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. దొమ్మాట మాజీ సర్పంచ్ కొమ్మెర పూజిత వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు సంతోష్ కుమార్ అందించిన సేవలను కొనియాడారు. రైతులతో ఆయన ఏర్పరచుకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఉద్యోగరీత్యా బదిలీలు సహజమని, ఎక్కడ పనిచేసినా రైతులకు మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. అలాగే ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ కార్యక్రమంలో



మాజీ ఉప సర్పంచ్ ఈదన్న వారి సింహాచలం, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యుడు ఎండి హుస్సేన్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కిష్టారెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బోగ్రోల్ల స్వామి, ఏఎంసీ డైరెక్టర్ ఎండి ఖసీం, రైతులు ఎండి షబ్బీర్, డి. ఎల్లయ్య, ఈదన్నగారి చంద్రం, అక్కమొల్ల స్వామి, పేర్క ఎల్లం, ఈ. శ్రీనివాస్, ఎండి సలీం, గొల్ల నర్సింలు, డ్రైవర్ లాచయ్య, పొట్టి స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ రైతులు అధిక సంఖ్యలో హాజరై ఏఈఓ సంతోష్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

# సోమిరెడ్డి వీరారెడ్డికి ఘన నివాళి

మునగాల జూన్ 13(ప్రజా దర్బార్) మండలంలోని నారాయణగూడ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వీరారెడ్డికి కోదాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే తిప్పని విజయసింహారెడ్డి లు అయన చిత్రపటానికి పూలమాలతో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ, పార్టీకి అంకితభావంతో సేవ చేసిన సోమిరెడ్డి వీరారెడ్డి అకాల మరణం మనందరికీ తీవ్ర విషాదమని అన్నారు. ఆయన ప్రజల కోసం పార్టీ కోసం చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని. ఇలాంటి వ్యక్తిని కోల్పోవడం కుటుంబానికి మాత్రమే కాదు పార్టీకి కూడా పెద్ద లోటు అని అన్నారు. ఇలాంటి నాయకులను కోల్పోవడం మనందరికీ బాధాకరం కానీ వారి ఆశయాలను, ప్రజా సేవా భావం మనందరికీ ఆదర్శంగా నిలబెట్టుకోవడం అని అన్నారు. మనం ఒక విషయం



గుర్తుంచుకోవాలనీ వ్యక్తులు మన మధ్యన లేకున్నా వారి ఆలోచనలు వారి పోరాటం వారి సేవాస్ఫూర్తి ఎప్పటికీ నిలిచిపోతాయనీ అన్నారు. ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని అన్నారు. భగవంతుడు వారి కుటుంబానికి మనోధైర్యం ఇవ్వాలనీ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు సుంకరి అజయ్ కుమార్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు తోగరు రమేష్, సొసైటీ చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, తొగరు సీతారాములు, ఉడుం కృష్ణ, ఎల్పి రామయ్య, గడ్డం లింగయ్య, టిడిపి నాయకులు కోటిరెడ్డి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# వర్షంలోనూ ప్రజాసేవలో సైబరాబాద్ పోలీసులు



ప్రజాదర్బార్ చందానగర్ జూన్ 13 : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల మధ్య కూడా పోలీసులు ప్రజల భద్రత, సౌకర్యాల కోసం నిరంతరం సేవలందిస్తున్నారు. ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది రోడ్లపై ప్రత్యేక విధులు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను సమర్థంగా నియంత్రిస్తూ ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నారు. మరోవైపు లా అండ్ ఆర్డర్ సిబ్బంది వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ సేవాభావాన్ని చాటుతున్నారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా సూచనలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు పోలీసు యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా పనిచేస్తోంది. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీసులు ప్రజలకు అవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. వర్షం ఎంత కురిసినా... ప్రజల భద్రత కోసం సైబరాబాద్ పోలీసులు క్షేత్రస్థాయిలో సేవలు అందించడం ప్రశంసనీయమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# హిమాలయాల్లో న్యూక్లియర్ డివైస్..

న్యూఢిల్లీ: హిమాలయాల్లోని నందా దేవి కొండల్లో ప్రచ్ఛన్న యుద్ధ కాలం నాటి న్యూక్లియర్ డివైస్ కూరుకుపోయింది. చైనాపై గూఢచ ర్యం కోసం 1965లో సీఐఏ రహస్యంగా ఓ మిషన్‌ను నిర్వహించింది. దీనిలో భాగంగా ప్లుటోనియం పవర్డ్ జనరేటర్‌ను అమెరికన్, ఇండియన్ పర్వతారోహకులు తీసుకెళ్లారు. అది ప్రమాదవశాత్తూ ఇక్కడ పడిపోయింది. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుందనే ఆందోళన దశాబ్దాల నుంచి వ్యక్తమవుతున్నది. జపాన్‌లోని నాగసాకిపై వేసిన అణు బాంబులో ఉన్న పీయూ-239 ఐసోటోప్, అత్యధిక రేడియోధార్మిక ఇంధనం పీయూ-238 ఈ డివైస్‌లో ఉండటంతో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ మిషన్‌ను నిర్వహించిన వారిని విస్తృత స్థాయిలో ఇంటర్వ్యూలు చేసినపుడు, అమెరికా, భారత్ ప్రభుత్వాల వద్ద ఉన్న రహస్య పత్రాలను పరిశీలించినపుడు, ఈ డివైస్ గురించి బయటపడింది. ఈ డివైస్‌పై సమాధానం చెప్పాలని భారతీయులు 1970వ దశకం నుంచి ఇప్పటికీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ న్యూక్లియర్ డివైస్ మంచు ప్రవాహంలో కొట్టుకొస్తే, రేడియో ధార్మిక పదార్థం

# రైతుల చెమటకు కోతలు...
# జగ్గంగూడ కేంద్రంలో అక్రమాల ఆరోపణలు



శామీర్ పెట,జూన్ 13(ప్రజాదర్బార్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్యాయం జరుగుతోందంటూ మూడుచింతలపల్లి మున్సిపల్ జగ్గంగూడ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం బస్తాల లెక్కలు, మిల్లర్ల వద్ద నమోదైన లెక్కల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని ఆరోపించారు.

రైతుల కథనం ప్రకారం, ఇటీవల జగ్గంగూడ కొనుగోలు కేంద్రం నుంచి 810 ధాన్యం బస్తాలను లారీలో మిల్లర్లకు తరలించగా, అక్కడ తూకం వేయగా 33 బస్తాల తేడా మాత్రమే ఉన్నప్పటికీ, కొనుగోలు కేంద్రం రికార్డుల్లో 63 బస్తాలు కోత విధించినట్లు నమోదు చేశారని తెలిపారు. దీంతో కేంద్రం నిర్వహణలో అక్రమాలు చోటుచేసుకున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా చదువురాని రైతుల సంతకాలను ఫోర్జరీ చేసి,రశీదులపై ఇంగ్లీషులో సంతకాలు చేస్తున్నారని, రైతులకు రావాల్సిన పూర్తి మొత్తాన్ని ఖాతాల్లో జమ చేయడం లేదని ఆరోపించారు. ఈ వ్యవహారం అలియాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి విజయ్ ఆదేశాల మేరకు జరుగుతోందని జగ్గంగూడ కేంద్ర నిర్వాహకుడు రాము తెలిపినట్లు రైతులు పేర్కొన్నారు.ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగ్గంగూడ కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు విష్ణువర్ధన్ రెడ్డి, వీరేశం, ప్రహ్లాద్, సత్తయ్య, శ్రీకాంత్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్య భరోసాకు సీఎం రిలీఫ్ ఫండ్ గొప్ప అండ

## - దండు మరియమ్మకు రూ.25 వేల చెక్కు అందజేసిన తోటకూర వజ్రేష్ యాదవ్,సింగిరెడ్డి పద్మారెడ్డి



మేడిపల్లి,జూన్13(ప్రజాదర్బార్) : పేద,మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం నుంచి ఉపశమనం కల్పించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి కీలక పాత్ర పోషిస్తోందని మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్‌కు చెందిన దండు మరియమ్మకు 25 వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా సింగిరెడ్డి పద్మారెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయుక్తంగా మారిందన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో కార్పొరేట్ వైద్యం సామాన్య ప్రజలకు భారంగా మారిన నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం అనేక కుటుంబాలకు ఆపన్నహస్తంగా నిలుస్తోందని చెప్పారు.వైద్య చికిత్సల కోసం భారీగా ఖర్చు చేయలేని పేద ప్రజలకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం ప్రత్యక్షంగా ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందుకున్న దండు మరియమ్మ కుటుంబ సభ్యులు తమకు ఆర్థిక సహాయం అందించేందుకు సహకరించిన తోటకూర వజ్రేష్ పద్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నత్తి మైసయ్య,పడుతం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లారెడ్డి దంపతులకు టీటీడీ బ్రహ్మోత్సవాల ఆహ్వానం

## - వేద ఆశీర్వచనాలతో ఆహ్వాన పత్రిక అందజేసిన టీటీడీ పండితులు

మేడిపల్లి,జూన్13(ప్రజాదర్బార్) : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మాజీ మంత్రి,మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి దంపతులను టీటీడీ వేద పండితులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారి నివాసానికి వెళ్లిన టీటీడీ ప్రతినిధులు,వేద పండితులు వేద మంత్రోచ్చారణల నడుమ ఆశీర్వచనాలు అందించి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా పండితులు మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహంతో ప్రతి ఏడాది నిర్వహించే బ్రహ్మోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచే మహోత్సవాలని పేర్కొన్నారు. జూన్ 19 నుంచి ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో ప్రత్యేక పూజలు,వాహన సేవలు,ధార్మిక కార్యక్రమాలు,వేద పారాయణాలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.మాజీ మంత్రి మల్లారెడ్డి దంపతులు టీటీడీ పండితులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. సమాజంలో ఆధ్యాత్మిక విలువలు పెంపొందించడంలో ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు జగన్మోహన్ రెడ్డి,డాక్టర్ శ్రీదేవి, భార్గవి,టీటీడీ ప్రతినిధులు పాల్గొన్నారు.



# చీర్యాల భూవివాదం, హత్యాయత్నం కేసులో మరో 14 మంది అరెస్ట్.

కీసర జూన్ 13 ప్రజా దర్బార్: కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని చీర్యాల గ్రామ భూవివాదానికి సంబంధించిన హత్యాయత్నం కేసులో మరో 14 మంది నిందితులను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులు పల్లె భద్రరెడ్డి, బొల్లంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పంజా సంజయ్ కుమార్‌లను ఇప్పటికే జూన్ 7న అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే.పోలీసుల దర్యాప్తులో భాగంగా ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్న మరో 14 మంది నిందితుల ప్రమేయం వెలుగులోకి రావడంతో వారిని అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. భూవివాదం నేపథ్యంలో చిర్యాల గ్రామంలోని వివాదాస్పద స్థలం వద్ద విధులు నిర్వహిస్తున్న వాచ్‌మన్ గోదుగు సాయికుమార్‌తో పాటు అతడిని రక్షించేందుకు వచ్చిన వారిపై ఇనుప రాడ్లు, హ్యామర్లు, కర్రలు, రాళ్లతో దాడి చేసి తీవ్ర గాయాలు కలిగించినట్లు పోలీసులు తెలిపారు.బాధితుల వాంగ్మూలాలు,ప్రత్యక్ష సాక్షుల ప్రకటనలు, స్వాధీనం చేసుకున్న వస్తువులు, సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుల ప్రమేయాన్ని నిర్ధారించినట్లు వెల్లడించారు. ఈ కేసులో మరికొంత మంది నిందితులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.భూ వివాదాలను చట్టబద్ధంగా కోర్టులు లేదా రెవెన్యూ శాఖల ద్వారా పరిష్కరించు కోవాలని,రౌడీలను సమీకరించి దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజ్ గిరి ఆజోన్ డీసీపీ సి.హెచ్. శ్రీధర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో కీసర సీఐ ఆర్కేపల్లి ఆంజనేయులు,ఎస్సైలు హరిప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చమురు ట్యాంకర్‌ను సీజ్ చేసిన ఇరాన్

న్యూఢిల్లీ: ఒమన్‌లో భారీ పరిమాణంలో చమురును మోసుకెళ్తున్న ఒక నౌకను ఇరాన్ సీజ్ చేసింది. అందులో భారతీయులతోపాటు శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు చెందిన 18 మంది సిబ్బంది ఉన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ఈ ఘటన జరిగింది. 60 లక్షల లీటర్ల చమురును అక్ర మంగా తరలిస్తున్నారని, అందుకే నౌకలోని నావిగేషన్ వ్యవస్థలన్నింటినీ నిలిపివేశారని ఇరాన్ మీడియా వెల్లడించింది. గల్ఫ్‌లో అక్రమంగా ఇంధనం రవాణా చేస్తోన్న నౌకలను అడ్డుకుంటు న్నట్లు ఇరాన్ ఇప్పటికే పలుమార్లు వెల్లడించింది. చమురు ఎగుమతి చేస్తోన్న దేశాల్లో ఒకటైన ఇరాన్‌లో చమురు ధరలు అతి తక్కువగా ఉంటాయి. అందుకే ఇక్కడినుంచి ఇతర దేశాలకు అక్రమంగా ఎగు మతి చేసి, కొందరు భారీ లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ కార్యకలాపాలను ఇరాన్ ఎప్పటికప్పుడు అడ్డుకుంటోంది. కాగా వెనెజువెలా తీరంలో రెండు రోజుల క్రితం అమెరికా ఒక ఆయిల్ ట్యాంకర్‌ను సీజ్ చేసింది. నౌక కెప్టెన్ వెనెజువెలా, ఇరాన్‌ల నుంచి అక్రమంగా చమురు రవాణా చేస్తున్నాడన్న ఆరోపణలతో ఈ నౌకను అగ్రరాజ్యం అడ్డుకుంది. వెనెజువెలా తీరం నుంచి క్యూబాకు బయలుదేరిన ఈ భారీ నౌకను అమెరికా సైనికులు తమ అధీనంలోకి తీసుకున్నారు.

# బావుపేట వద్ద రోడ్డుపై బీజేపీ ధర్నా

## కరీంనగర్ - కామారెడ్డి రహదారిపై స్తంభించిన ట్రాఫిక్ -వారం రోజుల్లో రోడ్డును బాగు చేయకపోతే భారీ ఆందోళన చేపడతాం...బిజెపి మండల అధ్యక్షులు కుంట తిరుపతి హెచ్చరిక

ప్రజాదర్బార్, కొత్తపల్లి : కరీంనగర్ – కామారెడ్డి ప్రధాన రహదారిపై బావుపేట స్టేజీ వద్ద రోడ్డు పూర్తిగా అధ్వాన్నంగా తయారై, నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిందని ఆరోపిస్తూ శనివారం రోజున కొత్తపల్లి రూరల్ మండల అధ్యక్షులు కుంట తిరుపతి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కరీంనగర్ .. కామ రెడ్డి ప్రధాన రోడ్డుపై బైఠాయించి భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు కుంట తిరుపతి మాట్లాడుతూ ముఖ్యమైన కరీంనగర్ కామారెడ్డి ప్రధాన రహదారి మీదుగా సిరిసిల్ల, వేములవాడ తదితర ప్రాంతాలకు వెళ్ళే ప్రజలు , వాహనదారులు బహు పేట రాగానే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇక్కడి ప్రాంతానికి వందలాది సంఖ్యలో తరలివచ్చే గ్రానైట్ వాహనాల రాకపోక ల కు అనుగుణంగా రోడ్డు నిర్మించకపోవడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయన్నారు . ప్రధాన రహదారి మీద ఏర్పడిన భారీ గుంతల కారణంగా , వర్షపు నీరు ఆ గుంతలలో నిలిచి వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందన్నారు. పూర్తిగా ఇక్కడి ప్రాంతం గుంతలమయమైన రహదారి కావడం వల్ల నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. గత కొంతకాలంగా ఈ ప్రధాన రహదారి పరిస్థితి రోజురోజుకీ అధ్వానంగా మారుతున్న అధికారులు,




పాలకులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ముఖ్యంగా రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడటంతో ద్విచక్ర వాహనదారులు, కారు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే పలువురు ప్రమాదాల బారిన పడి తీవ్రంగా గాయపడ్డారని గుర్తు చేశారు. రాత్రి వేళలో నరకం కనిపిస్తోందన్నారు. బావుపేట వద్ద దెబ్బతిన్న రోడ్డుకు తక్షణమే శాశ్వత ప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలనీ, పనులు పూర్తయ్యే లోపు ప్రమాదకర గుంతల వద్ద వాహనదారుల రక్షణ కోసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలనీ, కరీంనగర్ – కామారెడ్డి ప్రధాన రహదారి అభివృద్ధికి ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక నిధులు కేటాయించాలనీ ఆయన డిమాండ్ చేశారు. "నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ ప్రధాన రహదారిని నిర్లక్ష్యం చేయడం వల్లే ఎంతోమంది అమాయకులు ప్రమాదాల బారిన పడుతున్నందున, ప్రభుత్వం. అధికారులు స్పందించి వారం రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభించకపోతే, బీజేపీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపడతామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వేముల అనిల్ కుమార్, సోమినేని కర్ణాకర్, నేరెళ్ల గంగారం, సోమినేని అజయ్, సటు నవీన్ తదితరులతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

# డ్రగ్స్,గంజాయి వినియోగం -- రోడ్డు భద్రతపై కీసరలో అవగాహన కార్యక్రమం



కీసర,జూన్ 13 ప్రజా దర్బార్:డ్రగ్స్,గంజాయి,మత్తు పదార్థాలు మరియు పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలు,యువతలో చైతన్యం కల్పించేందుకు కీసర పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు.శనివారం సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం జడ్పిహెచ్ఎస్ గోరంట్ల పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ,మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక,మానసిక, ఆర్థిక,సామాజిక నష్టాలు సంభవిస్తాయని పేర్కొన్నారు. యువత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి సమాజానికి,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.అలాగే రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని,ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్ డ్రైవర్లు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు."నో డ్రగ్స్ సేవ్ లైఫ్" నినాదంతో కరపత్రాల పంపిణీ, ఫ్లెక్సీలు, మైక్‌సెట్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారుఈ కార్యక్రమంలో కీసర పోలీస్ స్టేషన్ సిబ్బంది,యువత,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# చీర్యాల భూవివాదం, హత్యాయత్నం కేసులో మరో 14 మంది అరెస్ట్

కీసర జూన్ 13 ప్రజా దర్బార్: కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని చీర్యాల గ్రామ భూవివాదానికి సంబంధించిన హత్యాయత్నం కేసులో మరో 14 మంది నిందితులను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులు పల్లె భద్రరెడ్డి, బొల్లంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పంజా సంజయ్ కుమార్‌లను ఇప్పటికే జూన్ 7న అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే.పోలీసుల దర్యాప్తులో భాగంగా ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్న మరో 14 మంది నిందితుల ప్రమేయం వెలుగులోకి రావడంతో వారిని అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. భూవివాదం నేపథ్యంలో చిర్యాల గ్రామంలోని వివాదాస్పద స్థలం వద్ద విధులు నిర్వహిస్తున్న వాచ్‌మన్ గోదుగు సాయికుమార్‌తో పాటు అతడిని రక్షించేందుకు వచ్చిన వారిపై ఇనుప రాడ్లు,




హ్యామర్లు, కర్రలు, రాళ్లతో దాడి చేసి తీవ్ర గాయాలు కలిగించినట్లు పోలీసులు తెలిపారు.బాధితుల వాంగ్మూలాలు,ప్రత్యక్ష సాక్షుల ప్రకటనలు, స్వాధీనం చేసుకున్న వస్తువులు, సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుల ప్రమేయాన్ని నిర్ధారించినట్లు వెల్లడించారు. ఈ కేసులో మరికొంత మంది నిందితులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.భూ వివాదాలను చట్టబద్ధంగా కోర్టులు లేదా రెవెన్యూ శాఖల ద్వారా పరిష్కరించు కోవాలని,రౌడీలను సమీకరించి దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజ్ గిరి ఆజోన్ డీసీపీ సి. హెచ్. శ్రీధర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో కీసర సీఐ ఆర్కేపల్లి ఆంజనేయులు,ఎస్సైలు హరిప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీ రాంజీ స్కీంపై కేంద్రానికి వ్యతిరేకంగా లేఖ రాస్తాం: మంత్రి సీతక్క

హైదరాబాద్, జూన్ 13 : కేంద్రం జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని తలపెట్టిన వీబీజీ రాంజీ స్కీం పట్ల నిరసన తెలపాలని తమ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తమ నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మాణం చేశామని ప్రస్తావించారు. ఈ లేఖలో పొందుపర్చాల్సిన అంశాలపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు, ఇతర అధికారులతో ప్రజాభవన్‌లో మంత్రి సీతక్క ఈరోజు (శనివారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీకి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం నిధులు కేంద్రం నుంచి రావాలన్నా నూతన స్కీంను అమలు చేయక తప్పదని అధికారులు సూచించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు నూతన పథకం అమలుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నాయని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో నూతన పథకంపై అవలంభిస్తున్న విధానంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. నూతన పథకం అమలుపై కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

# ఫ్యూచర్ సిటీకి విపరీతమైన క్రేజ్

హైదరాబాద్,: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ.. దేశంలో మరే ఇతర కొత్త నగర నిర్మాణానికి దక్కని అరుదైన ప్రాముఖ్యతను దక్కించుకుంది. 13,500 ఎకరాల్లో సువిశాలం గా రూపుదిద్దుకోనున్న ఈ నగరం, కేవలం రెండు రోజుల తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025 విజయ ంతోనే ప్రపంచ పారిశ్రామిక పటంలో కీలక గమ్యస్థానంగా నిలిచింది. ఈ సమ్మిట్‌లో 44 దేశాల ప్రతినిధులు హాజరు కావడం, రూ.5.7 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరగడం ఫ్యూ చర్ సిటీ పట్ల ఇన్వెస్టర్ల విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది.దేశంలో ఇప్పటికే అనేక స్మార్ట్ సిటీలు, కొత్త నగరాల నిర్మాణ ప్రతిపాదనలు దశాబ్దాలుగా కేవలం కాగితాలకే పరిమితమైన సందర్భాలు ఉన్నాయి. కానీ భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి వేదికగా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించడం అనేది సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ దార్శనికత, కార్యాచరణ వేగానికి నిదర్శనం అని పలువురు అభిప్రాయపడు తున్నారు. సమ్మిట్ ముగిసిన వెంటనే ఫ్యూచర్ సిటీ కార్యరూపం దాల్చడానికి మార్గం సుగమమైంది.

# వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కల్పించాలి

## బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

ప్రజాదర్బార్, కుత్బుల్లాపూర్, జూన్, 13, జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధికారులతో పర్యటించిన అనంతరం వార్డ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక చిన్నపాటి వర్షానికే వరద నీరు ఇళ్లలోకి చేరుతుందని, అర్ధరాత్రి వేళలో లో ప్రెజర్ తో త్రాగునీటిని సరఫరా చేయడం వల్ల త్రాగడానికి నీకు లేక ఇబ్బందులు పడుతున్నామని, అదేవిధంగా తమ జీవనోపాధి కోసం డబ్బాలను ఏర్పాటు చేసుకొని చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహించుకుంటే అధికారులు డబ్బాలను తొలగించాలంటూ వేధింపులకు గురి చేస్తున్నారన్నారని రాజీవ్ గృహకల్ప వాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప సముదాయంలో ఉండేది అధికంగా పేదలేనని, జీవనోపాధి కోసం కూలి పనికోసం, ఉద్యోగాలకు కోసం




నగరానికి వెళ్లి వచ్చే ప్రైవేటు ఉద్యోగులు అర్ధరాత్రి వేళల్లో లో ప్రెజర్ తో నీటిని సరఫరా చేయడం ద్వారా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి సరఫరా వేళల్లో మార్పులు చేసి అర్ధరాత్రి వేళల్లో కాకుండా సాయంత్రం వేళల్లో నీటిని విడుదల చేయాలని అన్నారు. అదేవిధంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలను, ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, వేణు యాదవ్, రాజీవ్ గృహకల్ప సముదాయం సంక్షేమ సంఘాల సభ్యులు, గృహకల్ప వాసులు, స్థానిక నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పై అదనపు కలెక్టర్ సమీక్ష

## ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిపై సమీక్ష నిర్వహించిన స్థానిక సంస్థల అదరపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

(ప్రజాదర్బార్/ మహబూబునగర్) ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మెటీరియల్ కాంపోనెంట్ ఎస్టిమేషన్ ప్రిపరేషన్, తదితర అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ వెబ్ ఎక్స్ ద్వారా శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరైన 90 రోజుల లోపల ఉపాధి హామీ పథకంలో భాగంగా చెల్లింపులు చేయడం జరుగుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. శనివారం ఆయన వెబ్ ఎక్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణపు వివరాలను తెలుసుకున్నారు. ఇల్లు మంజూరు అయిన 90 రోజుల లోపల ఉపాధి హామీ పథకంలో భాగంగా డబ్బులు చెల్లింపులు చేయడం జరుగుతుందని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. ఇప్పటివరకు 5972 ఇళ్లకు గాను







3493 ఎన్ఆర్ఈజీఏ పథకం కింద చెల్లింపుల కొరకు మస్టర్లు ఇవ్వడం జరిగింది అన్నారు. మిగతా 2478 ఇండ్లకు ఈ నెల ఆఖరి వరకు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా పరిషత్, డి ఆర్ డి ఓ పిడి, హౌసింగ్ పీడీ, ఎంపీడీవోలు, ధ్రువ నిర్మాణ శాఖ ఏఈ లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సాంకేతిక సిబ్బంది, ఈసీలు, ఏ పి ఓ లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్లపై అవగాహన

సదాశివనగర్ జూన్ 13 (ప్రజాదర్బార్ ప్రతినిధి): సదాశివనగర్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలోనే చేరేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం లో సర్పంచ్ వంకాయల శిరీష రవి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య బోధన అందుబాటులో ఉందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో చేరడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడుతుందని విద్యే జీవితానికి పునాది అని వారి తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# కూచూరు గ్రామంలో వ్యక్తి ఆత్మహత్య

నవాబుపేట జూన్ 13 (ప్రజాదర్బార్):-నవాబుపేట మండల పరిధిలోని కూచూరుగ్రామంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నరేందర్ తెలిపారు వివరాలు ప్రకారం కూచూరు గ్రామానికి చెందిన ప్రభాకర్ ,వయసు34 సంవత్సరాలు వృత్తి లారీ డ్రైవర్ గత నాలుగు సంవత్సరాల కింద మహేశ్వరం మండల్ నాగారం గ్రామానికి చెందిన లంబాడి పద్మమ్మ మహిళను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు మళ్లీ అదే గ్రామానికి చెందిన మాదిగ జోగు జయమ్మ తో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో అది తెలిసిన భార్య పద్మమ్మ విడాకులు ఇచ్చి వెళ్లిపోయింది, అప్పటినుంచి జయమ్మ తో సహజీవనం చేస్తూ ఉండేవాడు శనివారం 13 జూన్ 2026 నాడు మా గ్రామానికి చెందిన శంకరయ్య వ్యవసాయ పొలంలో చింత చెట్టుకు ఉరివేసుకొని చనిపోయినాడు నా కొడుకు చావుకు కారణం అయిన వారిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని తండ్రి కర్రే చెన్నయ్య ఫిర్యాదు చేశాడు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేందర్ తెలిపారు

# మళ్లీ విస్తరణ ఆశలు...

అదిలాబాద్,: ఉన్నది రెండు క్యాబినెట్ బెర్తులు. ఎంతోమంది ఆశావహులు. మరెన్నో క్యాస్ట్ ఈక్వేషన్స్. అయినా తన లెక్కలు తనకు ఉన్నాయంటున్నారు ఓ ఎమ్మెల్యే. ఎంబీసీ కోటాలో తనకు మినిస్ట్రీ పక్కా అని ధీమాగా ఉన్నారట. ఐయామ్ మోస్ట్ ఎలిజిబుల్ పర్సన్ అంటూ.. ఓ రేంజ్‌లో హోప్స్ పెట్టుకుని హైప్ క్రియేట్ చేస్తున్నారు. ఇంతకు ఎవరా ఎమ్మెల్యే? ఆయనకు అమాత్య యోగం అంత దగ్గరలో ఉందా?రెండో సారి క్యాబినెట్ విస్తరణపై ఆ ఎమ్మెల్యే ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎంబీసీ కోటా.. డిస్ట్రిక్ ఈక్వేషన్స్ ఎలా ఎన్నో లెక్కలు వేసుకున్నా.. అప్పట్లో జస్ట్ మిస్. అయినప్పటికి పట్టు వదలని విక్రమార్కుడిలా అలుపెరగని ప్రయత్నాలు చేస్తున్నారు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. ఇంకా మంత్రి వర్గంలో రెండు బెర్తులు ఖాళీగా ఉండటంతో..ఎంబీసీ కోటాలో ఛాన్స్ కోసం పట్టుబడుతున్నారట. రెండో విడత మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకోవాలనే ఆశతో సౌత్ టు నార్త్ ఎఫర్ట్స్ పెట్టినప్పటికీ ఫలితం దక్కలేదట. అయితే సామాజిక సమీకరణల నేపథ్యంలో ఇరుగు పొరుగు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మంత్రులయ్యారు కానీ..మక్కాన్ సింగ్ కోరిక నెరవేర లేదు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలలో మోస్ట్ బ్యాక్ వర్డ్ క్యాస్ట్ ఎమ్మెల్యేగా మక్కాన్ సింగ్ ఒక్కరే ఉన్నారు. మొదటి నుంచి ఎంబీసీ కోటాలో తనకు బెర్త్ దక్కడం ఖాయమని భావించిన ఆయనకు.. జిల్లా ఈక్వేషన్స్ మాత్రం అడ్డంకిగా మారుతు న్నాయట. ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి ముగ్గురు మంత్రు లు కేబినెట్ లో ఉండటంతో ఆయనకు ఛాన్స్ దక్క లేదు. అయితే నెక్స్ట్ విస్తరణలో మాత్రంజిల్లా నుండి ఓ మంత్రిని తప్పించైనా మక్కాన్ సింగ్ కు బెర్త్ ఖాయమనే చర్చ జోరుగాసాగుతోం ది. 2014, 2018లో రెండుసార్లు రామగుండం నుంచి పోటీ చేసి ఓడిన మక్కాన్ సింగ్.. 2023 ఎన్నికల్లో మాత్రం గెలుపొందారు. దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి హయంలో మక్కాన్ సింగ్ కు శాప్ ఛైర్మన్ పదవి దక్కింది.

### తొలకరి జల్లులు....

# వానాకాలం సాగులో రైతన్నలు హుషారు



రాజాపూర్ ,జూన్ 13(ప్రజాదర్బార్) తొలకరి జల్లులు పడటంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. రైతులు వానకాలం పంటల సాగుపై దృష్టి సారించారు. ఇప్పటికీ వ్యవసాయ దుక్కులను దున్నుకొని సిద్ధం చేసుకున్నారు. తొలకరి వర్షాలు కురుస్తున్నందున రాజాపూర్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతాంగం వ్యవసాయ పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. చాలా గ్రామాల్లో ఇప్పటికే ముందస్తుగా పత్తి విత్తనాలను వేశారు. వర్షాలు బాగా కురిస్తే వరినాట్లు వేయడం తోపాటు మొక్కజొన్న. ఇతర పంటలు వేయడానికి దుక్కులు సాగు చేసుకుంటున్నారు. బోరుబోవుల వద్ద నాట్లు వేయడానికి రైతులు ముందుకు రాగా.. బోరు బావులు లేని రైతులు మొక్కజొన్న, పత్తి పంట సాగు చేసేందుకు దృష్టి సారించారు. కాగా గత మూడు రోజుల నుంచి మండలంలోని పలు గ్రామాల్లో రైతులు దుక్కులు దున్ని విత్తనల కోసం భూమిని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ సారి సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండుతాయని రైతులు భావించి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

**రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి.......**

వానాకాలం సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఫర్టిలైజర్ వ్యాపారులపై నిఘా ఉంచి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందే విధంగా అధికారులు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు. యాసంగి సాగులో రైతులు వరి సాగు చేయగా చాలా మంది రైతులకు దిగుబడి తక్కువగా వచ్చిందని దీనికి కారణాలు ఏమిటి అని రైతులు చర్చించుకుంటున్నారు. వానకాలం సాగు మొదలు కాగా అన్ని షాపుల్లో నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**హొఎరువులుహొఅందుబాటులో ఉంచాలి..**

వానాకాలం వ్యవసాయ పంటల సాగు కోసం వివిధ రకాలహొహొఎరువులనుహొఅందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. యాసంగి సాగులో అనేక అవస్థలు పడ్డామని. వానాకాలం పంటల సాగు కోసం అన్ని రకాల ఎరువులను షాపుల్లో అందుబాటులో ఉంచే విధంగా వ్యవసాయ అధికారులు కృషి చేయాలని రైతులు పేర్కొంటున్నారు. కోటి ఆశలతో వానకాలం పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లో వ్యవసాయ పనులు రెండు రోజుల నుంచి ఊపందుకున్నాయి.

## రాజీమార్గమే రాజమార్గం

### - ఎస్ఐ చంద్రశేఖర్




ములుగు, జూన్ 14(ప్రజాదర్బార్): కేసుల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వేదికగా జాతీయ లోక్‌అదాలత్ జూన్ 10 నుంచి 20 వరకు ములుగు జిల్లా కోర్టులో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ములుగు పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ వివాదాల సత్వర పరిష్కారానికి రాజీమార్గమే శ్రేష్ఠమైనదని అన్నారు. లోక్‌అదాలత్ ద్వారా ఇరుపక్షాల వారికీ కోర్టు చుట్టూ తిరగకుండా, సమయం, ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు. ఇరువర్గాలకూ ఆమోదయోగ్యమైన న్యాయం లభిస్తుందన్నారు. ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీపడదగ్గ కేసులకు సంబంధించిన కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కక్షిదారులు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంప్రదించవచ్చని, మరిన్ని వివరాలకు 8712670081, 8712670082 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### కేశవరం చరిత్రకు అక్షర రూపం..

# 'నా ఊరు యాది జేస్తుంది' పుస్తకావిష్కరణ"



శామీర్ పేట,జూన్ 13(ప్రజాదర్బార్ ):గ్రామ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ప్రముఖ కవి, మూడు చింతలపల్లి మున్సిపల్ కేశవరం వాస్తవ్యులు మేడోజి బలరాం చారి రచించిన "నా ఊరు యాది జేస్తుంది" పుస్తకాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ శనివారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మేడోజి బలరాం చారి తన స్వగ్రామంపై ఉన్న అభిమానంతో ఎంతో సమాచారాన్ని సేకరించి, గత 70 సంవత్సరాలుగా కేశవరం గ్రామంలో జరిగిన మార్పులను చక్కగా ఆవిష్కరించారని కొనియాడారు.

గ్రామంపై ప్రేమాభిమానాలు పెంపొందించేలా ఈ పుస్తకం భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు బొమ్మలపల్లి మల్లేష్ యాదవ్, కొంపల్లి మాధవి భూమేష్ గౌడ్, మేడోజి రవీంద్ర చారి, దొమ్మాట రామస్వామి, భూమేష్ గౌడ్, మహమ్మద్ యూసఫ్, మామిండ్ల మల్లేష్ యాదవ్, ఉడతల మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# నెట్టింట 3డీ కార్టూన్ ఫీవర్!

సోషల్ మీడియాలో స్క్రోల్ చేస్తుంటే.. ఒకదాని తర్వాత ఒకటి 3డీ ముఖాలు, క్యారెక్టర్లు కనిపిస్తున్నాయా? పెద్ద తల, చిలిపి కళ్లతో నవ్వుతున్న ఫొటోలు చూడగానే.. కార్టూన్ సినిమా పోస్టర్‌లా అనిపిస్తున్నాయా? అయితే, మీరు ఇప్పటికే మొదలైన కొత్త ట్రెండ్ జోన్‌లో ఉన్నారు! ఎందుకంటే.. ఇప్పుడు అందరూ తమ సెల్ఫీలను సినిమా లుక్‌లోకి మార్చుకుంటు న్నారు. ఆ ట్రాన్స్‌ఫర్మేషన్ వెనుక ఉన్న మాయాజాలం.. గూగుల్ జెమినీ నానో బనానా ప్రో! ఇది ఫొటోను సాధారణ ఫిల్టర్‌లా మార్చదు.. పూర్తిగా కొత్తదానిలా క్రియేట్ చేస్తుంది. అందుకే ఫొటోలోని ముఖం, భావం, లైటింగ్ అన్నీ రియలిస్టిక్‌గా కనిస్తాయి. దానికితోడు చిలిపిగా, పిక్సర్ స్టయిల్‌లో ఆకట్టుకుంటాయి. ఇలాంటివే ఇప్పుడు ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో తెగ వైరల్ అవుతున్నాయి. ఈ ట్రెండ్‌ని ఇప్పటికే పలువురు ఏఐ క్రియేటర్లు ట్రై చేశారు. సింపుల్‌గా.. '3డీ క్యారికేచర్ లుక్‌లో, పెద్ద తలతో, చిలిపి ముఖ కవళికలతో ఫొటో కావాలి' అని ప్రాంప్ట్ చేస్తే సరిపోతుంది. మీకు కావాల్సిన క్యారెక్టర్ మీ కళ్ల ముందు వాలిపోతుంది. ఇందులో ఆశ్చర్యపడి పోవడానికి ఏం లేదు. జెమినీ మోడల్ తన క్రియేటివ్ జీనియస్ ఎప్రోచ్‌తో ఇదంతా చేస్తున్నది. ఫొటోను ఎక్కడా ఎడిట్ చేయదు.. కొత్తగా ప్రొడ్యూస్ చేసి ఇస్తుంది. మాటలతో, ఎమోషన్‌తో, బ్యాక్‌డ్రాప్‌తో అన్నీ మీరు కోరినట్టుగా ఇచ్చేస్తుంది. ఉదాహరణకు.. 'పారిస్ సన్‌సెట్‌లో నా 3డీ ఫొటో కావాలి' అని చెబితే.. ఆ సన్నివేశం,

# లాలాగూడ క్యారేజ్ వర్క్ షాప్ ను తనిఖీ చేసిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ

## శనివారంనాడు లాలాగూడ లోని గ్యారేజ్ వర్క్ షాప్ తనిఖీ.-దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ కు వర్కు షాప్ పనితీరు గురించి వివరించిన చీఫ్ వర్క్ షాప్ మేనేజర్ సుమన

(ప్రజాదర్బార్ /హైదరాబాద్) దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాత్సవ శనివారం (జూన్ 13,2026) సికింద్రాబాద్ లాలాగూడ లోని గ్యారేజ్ వర్క్ షాప్( సి.డబ్ల్యు.ఎస్) తనిఖీ చేశారు. జనరల్ మేనేజర్ లాలాగూడ లోని గ్యారేజ్ వర్క్ షాప్ ను సందర్శించి, వర్క్ షాప్ లోని అన్ని నిర్వహణ మరియు మరమ్మతు షాపులను తనిఖీ చేశారు.






ఈ సందర్భంగా చీఫ్ వర్క్ షాప్ మేనేజర్( సి.డబ్ల్యు.ఎం) శ్రీమతి సుమనజి, జనరల్ మేనేజర్ కు వర్క్ షాప్ పనితీరు గురించి వివరించారు. ఈ తనిఖీలో ఇతర సీనియర్ రైల్వే అధికారులు కూడా పాల్గొన్నారు. లాలాగూడ లోని క్యారేజ్ వర్క్ షాప్ ను సమగ్రంగా తనిఖీ చేశారు. వీల్ షాప్ నుండి తనిఖీని ప్రారంభించి, ఆ తర్వాత డి.వి ఓవర్ హాల్ విభాగం, ఎయిర్ బ్రేక్ షాప్, పెయింట్ షాప్ మరియు స్ప్రింగ్ షాపులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ పరిశీలన కాలంలో లాలాగూడ క్యారేజ్ వర్క్ షాప్ చీఫ్ వర్క్ షాప్ మేనేజర్( సి.డబ్ల్యు.ఎం) శ్రీమతి సుమన, అక్కడ పనిచేసే సిబ్బంది వీధి నిర్వహణలో పాటిస్తున్న వివిధ భద్రత ప్రమాణాలు మరియు సురక్ష విధానాలను జనరల్ మేనేజర్ కు వివరించారు. అంతేకాకుండా, వర్క్ షాప్ లో అందుబాటులో ఉన్న వివిధ అత్యాధునిక పరికరాల పనితీరు, వాటి నిర్వహణ పద్ధతులను కూడా ఆమె ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ కు కూలంకషంగా తెలియజేశారు. ఈ తనిఖీలలో భాగంగా వర్క్ షాప్ లోని అత్యాధునిక పరిశీలించారు.వర్క్ స్టేషన్లను, యంత్రాలను మరియు పరికరాలను కూడా పరిశీలించారు. ఇందులో భాగంగా ఎల్ హెచ్ బి వర్క్ స్టేషన్/ మెనుకులేటర్, డైనమిక్ వీల్ బ్యాలెన్సింగ్ మెషిన్, షాక్ అబ్జర్వర్ టెస్టింగ్ మెషిన్లను పరిశీలించారు. వీటితోపాటు బ్రేక్ సబ్-స్టోర్స్, నూతన ట్రిమ్మింగ్ షాప్, ఆప్టికల్ ఎ మిషన్ స్పెక్ట్రో మీటర్ మరియు యూనివర్సల్ టెస్టింగ్ మిషన్ వంటి అధునాతన సాంకేతిక విభాగాలను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పనిలో నాణ్యత ప్రమాణాలను నిరంతరం కొనసాగిస్తున్న తీరును జనరల్ మేనేజర్ అభినందించారు. అలాగే పని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి సరికొత్త సాంకేతికతను అలవర్చుకోవడం పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. వర్క్ షాప్ ను స్క్రాప్ రహిత( వ్యర్ధాలు లేని) యూనిట్ గా మారుస్తూ, అక్కడ పచ్చని పర్యావరణాన్ని కాపాడుతున్న సిబ్బందిని, అధికారులను ఆయన ప్రశంసించారు. భారతీయ రైల్వే లోనే లాలాగూడ వర్క్ షాప్ ను అత్యుత్తమ కోచ్ నిర్వహణ కేంద్రాలలో ఒకటిగా పరిగణించాలని ఆయన చెప్పారు. అలాగే ఈ ఘనతకు అక్కడి సిబ్బంది కారణమని అభినందించారు.

# పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, పీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి అని ఉప ముఖ్యమంత్రి కి వినతి

ప్రజాదర్బార్, కరీంనగర్ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ కరీంనగర్ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న 11,????కోట్ల ఫిజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయాలి అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు మట్టి విక్రమార్క కి వినతి పత్రం ఇవ్వడం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ కరీంనగర్ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు మాట్లాడుతు ఒక రాష్ట్ర అభివృద్ధి విద్యపై ఆధారపడి ఉంటుందని, విద్యను బలోపేతం చేయకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు.రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యాశాఖకు ఇప్పటివరకు పూర్తిస్థాయి మంత్రి నియామకం జరగకపోవడం వల్ల విద్యారంగానికి సంబంధించిన అనేక కీలక నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయని తెలిపారు. అందువల్ల వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు, రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ ఆలస్యం కావడం వల్ల అనేక మంది విద్యార్థులు తీవ్ర



ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువు కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.కొన్ని సందర్భాల్లో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు కళాశాలలకు హాజరు కాలేకపోతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఇది విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదకరమని పేర్కొన్నారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ఆ హక్కును రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్లో ఉన్న అన్ని స్కాలర్షిప్లు మరియు ఫీజు రీయింబర్స్మెంట్లను విడుదల చేయడంతో పాటు విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర హిస్టల్స్ కో-కన్వీనర్ నందు,నగర కార్యదర్శి యోగేష్,కార్యకర్తలు నిత్య,విగ్నేష్, ఆకాష్, పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛ పాఠశాల, స్వచ్ఛ భారత్..!


హుస్నాబాద్,జూన్13 (ప్రజాదర్బార్): భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనకు 12 సంవత్సరాలు పూర్తయి దిగ్విజయంగా కొనసాగుతున్న సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపుమేరకు హుస్నాబాద్ మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ ఆధ్వర్యంలో పొట్లపల్లి, మహమ్మదాపూర్, మీర్జాపూర్, బల్లు నాయక్ తండ, పందిళ్ళ, వంగరామయ్యపల్లి గ్రామాల్లో "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.హుస్నాబాద్ మండలలోని అన్ని గ్రామాల పాఠశాలల ప్రాంగణం, స్కూల్ గ్రౌండ్స్, తరగతి గదులు మరియు పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేస్తూ ప్రత్యేక శుభ్రత కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులకు పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ, స్వచ్ఛమైన పాఠశాల -- ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది అని నాయకులు పేర్కొన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం తీసుకువచ్చిందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, పాఠశాల, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.గ్రామ ప్రజలు స్వచ్ఛతపై అవగాహన పెంపొందించుకోవాలని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు లావుడియా ధన్ సింగ్, పుట్ట కొమురయ్య, అనిల్, రాజు, చరణ్, కనకయ్య , లావుడియా రాజన్ నాయక్, ఇస్లావత్ తిరుపతి, బొల్లి సుధాకర్ ,బొల్లి శ్రీనివాస్, రవీందర్ ,రత్నాకర్ రెడ్డి, పిట్టల సంతోష్ , కన్నె శంకర్, చంద్రశేఖర్ రెడ్డి, పిన్నెల్లి శ్రీనివాస్, అయోధ్య రామిరెడ్డి,మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 15 నుండి చర్లపల్లి రైల్వే స్టేషన్

# దక్షిణ వైపున ప్రవేశ నియంత్రణ వ్యవస్థ అమలు

**-దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు-జంట నగరాలలోని స్టేషన్లలో ఉన్న రద్దీని తగ్గించేందుకు చర్లపల్లి రైల్వే స్టేషన్ ను కొత్త హంగులతో ఆధునిక టెర్మినల్ గా అభివృద్ధి చేశారు.**








(ప్రజాదర్బార్/ హైదరాబాద్ ఈ నెల 15 నుంచి ఎల్లంపల్లి రైల్వే స్టేషన్ దక్షిణ వైపున ప్రవేశ నియంత్రణ వ్యవస్థ అమలు చేయబడుతుందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాత్సవ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి, అలాగే రైళ్ల రాకపోకలు ఎలాంటి ఆటంకం లేకుండా సాఫీగా సాగేలా చూడడానికి నిరంతరం కృషి చేస్తోంది. జంట నగరాలలోని సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ మరియు లింగంపల్లి స్టేషన్లలో ఉన్న రద్దీని తగ్గించడం కోసం చర్లపల్లి రైల్వే స్టేషన్ అన్ని కొత్త రంగులతో ఒక ఆధునిక టర్మినల్ గా అభివృద్ధి చేశారు. ఇప్పుడు ఇది హైదరాబాద్ తూర్పు ప్రాంత ప్రజలకు సేవలు అందిస్తోంది. కొత్తగా అభివృద్ధి చేసిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ లో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి, దక్షిణం మధ్య రైల్వే వారు దక్షిణ తెర్మల్ కొత్త భవనం( ప్లాట్ ఫామ్ నెంబర్ 9 వైపు) వద్ద "యాక్సిస్ కంట్రోల్ సిస్టం" (వాహనాల రాకపోకలను నియంత్రించే వ్యవస్థను) తీసుకు వస్తున్నారు. స్టేషన్ ఆవరణలో ప్రయాణికులను దింపడానికి మరియు లెక్కించుకోవడానికి( పిక్ -అప్ అండ్ డ్రాప్- ఆఫ్) వచ్చే వాహనాలను క్రమబద్ధీకరించడానికి 15.06.2026 అర్ధరాత్రి నుండి ఇది అమలులోకి వస్తుంది. చర్లపల్లి రైల్వే స్టేషన్ లోని కొత్త సౌత్ టెర్మినల్ భవనంలో (ప్లాట్ ఫామ్ నంబర్ 9 వైపు) విశాలమైన వెయిటింగ్ హాల్ లు, ఆధునిక ప్లాట్ ఫారం లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ప్రీమియం టాయిలెట్లు, మెరుగైన సైన్ బోర్డులు, మరియు ప్రయాణికులకు సమాచారం అందించే సౌకర్యాలు ఉన్నాయి. ప్రయాణికుల (టూ వీలర్), త్రి చక్ర( ఆటోలు), మరియు నాలుగు చక్రాల( కార్లు) వాహనాలను పార్కు చేయడానికి 6,622.09 చదరపు మీటర్ల ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని కేటాయించారు. దీనికి గంటల చొప్పున చాలా తక్కువ పార్కింగ్ చార్జీలు వసూలు చేస్తారు. నాలుగు చక్రాల వాహనాలు: మొదటి రెండు గంటలు 20/-, 10/- రూపాయలు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడడానికి వాహనాల రాకపోకలను సులభతరం చేయడానికి మరియు అనధికార పార్కింగ్ ను అరికట్టడానికి చర్లపల్లి రైల్వే స్టేషన్ దక్షిణ వైపున ఈనెల 15 నుంచి ఈ యాక్సెస్ కంట్రోల్ సిస్టంను అమలు చేస్తున్నారు. 2,3 అండ్ నాలుగు చక్రాల వాహనాలకు వేరువేరు దారులను ఏర్పాటు చేయడం ద్వారా ఎలాంటి ఆటంకం లేకుండా ప్రయాణికులను ఎక్కించుకోవడానికి మరియు దించడానికి ఈ సిస్టం ఉపయోగపడుతుంది. దీనివల్ల స్టేషన్ ముందు భాగంలో నడిచే వారికి ఎలాంటి ఇబ్బంది ఉండదు అలాగే ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది ఆటోలు టాక్సీలు మరియు ఇతర వాహనాలు సులభంగా లోపలికి రావడానికి వీలవుతుంది. ఇది ఈ నెల 15 నుంచి ప్రారంభమవుతుంది.

## అన్నపురెడ్డిపల్లిలో అసంపూర్తి పనుల కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూగజీవాల బలి-డివైడర్‌లో ఇరుక్కున్న మూగజీవాలు

అన్నపురెడ్డిపల్లి, జూన్ 13 (ప్రజాదర్బార్ ):– భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లిలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులు అస్తవ్యస్తంగా, అసంపూర్తిగా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ పనుల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరడంతో, తాజాగా సెంట్రల్ లైటింగ్ కోసం నిర్మించిన డివైడర్ కందకంలో ఒక గేదె ఇరుక్కుపోయి దయనీయ స్థితిలో ఉన్న దృశ్యం స్థానికులను కలచివేస్తోంది.నిర్లక్ష్యానికి నిదర్శనం సెంట్రల్ లైటింగ్ కోసం తవ్విన గుంతను అలాగే వదిలేయడం వల్ల మూగజీవాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. పనులు సకాలంలో పూర్తి చేయకపోవడమే కాకుండా, కనీస భద్రతా చర్యలు కూడా చేపట్టకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. నిర్మాణం ఉండగానే పగుళ్లు ఏర్పడడం ప్రజాధనం వృథా – అధికారుల బాధ్యతారాహిత్యం కిసెంట్రల్ లైటింగ్ ప్రాజెక్టు పనులు అసంపూర్తిగా నిలిచిపోవడం వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు పనుల నాణ్యత లోపంతో పాటు, ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వ ప్రాజెక్టులు ప్రజల సౌకర్యం కోసం ఉండాలి కానీ, ఇలా మూగజీవాలకు మరణశాసనంగా మారడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి, పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ లైటింగ్ పనులను పూర్తి చేయాలని, అలాగే ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



## రాజ్యసభలో బలం పెంచుకోడానికే బీజేపీ కుట్ర- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్

హైదరాబాద్, జూన్ 13: మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక నియంత దేశంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఏమీ లేదని.. నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలని కుట్రకు పూనుకున్నారని ఆరోపించారు. గాంధేయవాది, నిజాయతీకి నిలువుటద్దం మీనాక్షి నటరాజన్ అని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆఫీసు కల్పించుకుని కేసును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ఈ విషయంలో ఉరి వేసినా తప్పులేదన్నారు. ప్రధాని నియంతలా వ్యవహరించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయం జరగలేదన్నారు